సాక్షి
నిజామాబాద్
శుక్రవారం । 26 । జూలై । 2024



బర్త్‌డే పార్టీకి వెళ్లొచ్చేసరికి..

బంధువు పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడానికి హైదరాబాద్‌కు వెళ్లి వచ్చేలోగా నిజామాబాద్‌లోని ఓ ఇంట్లో చోరీ జరిగింది.

- IIలో ▸



61 ఏళ్ల ఎస్సారెస్పీ

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేసి నేటితో 61 ఏళ్లు పూర్తవుతోంది.

- IIలో ▸

గరిష్ఠం/కనిష్ఠం
26.4 /22.0

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

మత్స్య శాఖ ఏడీ బదిలీ

- నూతన ఏడీగా ఆంజనేయస్వామి



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా మత్స్య శాఖ అధికారి రాజనర్సయ్య బదిలీ అయ్యారు. ఖమ్మం జిల్లాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నూతన ఏడీగా ఆంజనేయస్వామి ఖమ్మం నుంచి వచ్చారు. ఈ మేరకు ఆయన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అదే విధంగా పోచంపాడ్ ఎఫ్‌డీవోగా డోలిసింగ్ నియమితులయ్యారు.

నేటి నుంచి రెండో విడత కౌన్సెలింగ్

నిజామాబాద్‌అర్బన్: ఇంజినీరింగ్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే ఏప్ సెట్ రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ శుక్రవారం ప్రారంభం కానున్నట్లు సమన్వయకర్త శ్రీరాంకుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం విద్యార్థులు నేటి నుంచి స్లాట్ బుకింగ్ చేసుకోవాలన్నారు. ఈనెల 27 నుంచి ఎంపిక చేసిన హెల్ప్‌లైన్ సెంటర్లలో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. అనంతరం వెబ్ ఆప్షన్ల ద్వారా కళాశాలను ఎంచుకోవాలన్నారు. అభ్యర్థులు ఈనెల 27, 28 తేదీల్లో ఆప్షన్లు ఎంచుకోవచ్చని పేర్కొన్నారు.

'నిజాంసాగర్'లోకి 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


నిజాంసాగర్(జుక్కల్): మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం 850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటి పారుదల శాఖ ఏఈ శివప్రసాద్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. గురువారం సాయంత్రానికి 1,388.32 అడుగుల(3.411 టీఎంసీలు) నీరు నిల్వ ఉందన్నారు.

కౌలాస్‌లోకి 521 క్యూసెక్కులు..

మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జుక్కల్ మండలంలోని కౌలాస్ నాలా ప్రాజెక్టులోకి 521 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని నీటిపారుదల శాఖ ఏఈ రవిశంకర్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 458 మీటర్లు(1.237 టీఎంసీలు) కాగా ప్రస్తుతం 454.70 మీటర్ల(0.580 టీఎంసీ) నీరు నిల్వ ఉందన్నారు.

నిజాం షుగర్స్‌పై ఆశలు

రాష్ట్ర బడ్జెట్‌లో నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క పేర్కొనడంపై చెరుకు రైతులు, ఫ్యాక్టరీ కార్మికుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సన్న వడ్లకు రూ.500 బోనస్‌పై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నప్పటికీ మిగిలిన రకాలకూ బోనస్ చెల్లించాలని డిమాండ్లు వస్తున్నాయి. అలీసాగర్, అర్గుల్ రాజారాం గుత్ప, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతలు, రామడుగు ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు కేటాయించారు. శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ఏరియాలో ఎకో టూరిజం ఊసు లేకపోవడంతో పర్యాటక ప్రేమికులు పెదవి విరుస్తున్నారు.




- సన్న వడ్లకు బోనస్‌పై రైతుల్లో సంతోషం
- నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు
- అలీసాగర్, గుత్ప, రామడుగు, చౌట్‌పల్లి హన్మంతరెడ్డి ఎత్తిపోతలకు రూ.34.61 కోట్లు
- శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ పరిధిలో ఎకోటూరిజంపై మొండిచెయ్యి
- రాష్ట్ర బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : శాసనసభలో ఆర్థిక మంత్రి మల్లు భట్టివిక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై జిల్లాలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. గత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలకు సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావించలేదని విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇది ప్రజలకు మేలు చేసేదిగా లేదని విపక్ష పార్టీల నాయకులు అభిప్రాయపడుతున్నారు. అయితే బడ్జెట్‌లో నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామని భట్టి విక్రమార్క పేర్కొనడం గమనార్హం. గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన మేరకు అతి త్వరలో నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామన్నారు. ఇందుకు సంబంధించి గత జనవరిలోనే ప్రత్యేక కమిటీ వేసినట్లు తన ప్రసంగంలో వివరించారు. నిజాం షుగర్స్ విషయమై కేసీఆర్ ప్రభుత్వం కనీస ఆలోచన కూడా చేయలేదని అన్నారు. కాగా వచ్చే సెప్టెంబర్ 17లోగా ఎన్ఎస్ఎఫ్‌ను తెరిపిస్తామని ఇప్పటికే ముఖ్యమంత్రి సైతం ప్రకటన చేసి ఉన్న నేపథ్యంలో ఈ విషయమై ఆసక్తి నెలకొంది.

■ శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ఏరియాలో ఎకోటూరిజం ప్రాజెక్టుకు సంబంధించి బడ్జెట్ లో పేర్కొనకపోవడం పట్ల జిల్లావాసుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. శ్రీరాంసాగర్ నుంచి బాసర వరకు బోటింగ్, సరస్వతి అమ్మవారి దర్శనం, మధ్యలో నందిపేట, డొంకేశ్వర్ మండలాల్లో గెస్ట్‌హౌజ్‌లు, వాచ్‌టవర్‌లు, రిసార్టులు ఏర్పాటు చేసేందుకు గతంలోనే ప్రతిపాదించారు. అయినప్పటికీ తాజా బడ్జెట్‌లో జిల్లాలో ఎకో టూరిజం ప్రస్తావన లేకపోవడం పట్ల పలువురు పెదవి విరుస్తున్నారు.



■ సన్న వడ్లకు రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమైనప్పటికీ మిగిలిన రకాలకు కూడా చెల్లించాలని డిమాండ్లు వస్తున్నాయి.



■ ఇందిరమ్మ ఇళ్ల విషయంలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్ల కేటాయించనున్నట్లు ప్రకటించారు. జిల్లాలోని అలీసాగర్, అర్గుల్ రాజారాం గుత్ప, చౌట్‌పల్లి హన్మంత్‌రెడ్డి ఎత్తిపోతలు, రామడుగు ప్రాజెక్టుల నిర్వహణకు కలిపి రూ.34.61 కోట్లు కేటాయింపులు చేసినట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు.



రైతులకు మేలు చేసేలా..



రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ రైతులందరికీ మేలు చేసేలా ఉంది. బడ్జెట్‌లో అత్యధికంగా వ్యవసాయానికి రూ. 72,659 కోట్లు కేటాయించారు. అదేవిధంగా ఉద్యాన శాఖకు సంబంధించి రూ.737 కోట్లు కేటాయింపులు చేయడం సంతోషకరం. అదే విధంగా పశుసంవర్ధక శాఖకు రూ.19,080 కోట్లు కేటాయించడం వ్యవసాయ అనుబంధ రంగానికి సైతం మేలు కలిగిస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు పక్షపాతి అని మరోసారి రుజువైంది.

– గోవర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు, నవీపేట

కాంగ్రెస్ నేతల జేబులు నింపేలా..

ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలకు ఉపయోగపడేదీ కాదని, కాంగ్రెస్ నేతల జేబులు నింపుకునే బడ్జెట్‌లా ఉంది. తెలంగాణ ప్రజలకు గాడిద గుడ్డు చూపారు. ఎన్నికల హామీలను పూర్తిగా విస్మరించారు. కల్యాణ లక్ష్మి ద్వారా అదనంగా తులం బంగారం, గల్ఫ్ కార్మికుల సంక్షేమ బోర్డు ప్రస్తావన లేకపోవడం బాధాకరం. గల్ఫ్‌లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రూ.5లక్షలు పరిహారం అందజేస్తామని చెప్పి.. బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. విద్యా భరోసా కార్డు, జాబ్ క్యాలెండర్ ఊసేలేదు. చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించేందుకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదు. జిల్లా అభివృద్ధికి అదనంగా నిధులు ఇవ్వలేదు.



– దినేష్ పటేల్ కులాచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

రాష్ట్ర దశదిశను మార్చే బడ్జెట్



ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్ర దశ దిశను మారుస్తుంది. అన్ని రంగాలకు నిధులు కేటాయిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కేటాయింపులు జరిగాయి. వ్యవసాయ రంగంతో పాటు అనుబంధ రంగాలను ప్రాధాన్యం ఇస్తూ రూ. 72వేల కోట్లు కేటాయించడం జరిగింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు గతం కంటే ఎక్కువ నిధులు కేటాయించారు. ప్రభుత్వం సమ సమాజ స్థాపనకు కృషి చేస్తుంది. పేద వర్గాలను రైతులను కార్మికులను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు జరిపింది. రాష్ట్రాభివృద్ధికి దోహదపడే బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు ముఖ్యమంత్రి, మంత్రి వర్గానికి కృతజ్ఞతలు.

– మానాల మోహన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

అబద్ధాల పుట్ట..



నిజామాబాద్‌నాగారం: కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ పూర్తిగా సత్య దూరంగా, అబద్ధాలా పుట్టగా ఉంది. గత ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై బురద జల్లే ప్రయత్నం తప్పా ప్రజా సంక్షేమం కనిపించలేదు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల ప్రస్తావనే లేదు. రూ. 4వేల చేస్తామన్న ఆసరా పెన్షన్, మహిళలకు రూ. 2,500, నిరుద్యోగ భృతికి నిధులు కేటాయించలేదు. రైతు భరోసాపై కమిటీ వేశామంటూ మాట దాటేశారు తప్పా కేటాయింపులు చేయలేదు. జాబ్ క్యాలెండర్‌పై ప్రస్తావన లేదు. ఎన్నికల ముందు వరికి ప్రతి క్వింటాలుకు రూ. 500 బోనస్ అని చెప్పి ఇప్పుడు సన్న వడ్లకే అంటున్నారు. కానీ బడ్జెట్‌లో వాటికి కూడా నిధులు కేటాయించలేదు.

– వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్యే బాల్కొండ

విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తాం

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్ఈ రాపెల్లి రవీందర్ తెలిపారు. సాక్షి ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన 'ఫోన్ ఇన్' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ఎస్ఈ వినియోగదారుల సమస్యలను తెలుసుకుని వారి ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. జీరో బిల్లులు, విద్యుత్ లో, హైవోల్టేజీ, స్తంభాల మార్పులు, ట్రాన్స్‌ఫార్మర్లపై అధికంగా ఫిర్యాదులు వచ్చాయి. అనంతరం వినియోగదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎస్ఈ ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్ ఉద్యోగులు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

– నిజామాబాద్‌నాగారం

- ఉద్యోగులు బాధ్యతాయుతంగా నడుచుకోవాల్సిందే
- 'సాక్షి' ఫోన్‌ఇన్‌లో ట్రాన్స్‌కో ఎస్ఈ రాపెల్లి రవీందర్



ప్రశ్న: తాను ప్రజా పాలనలో గృహజ్యోతి కోసం దరఖాస్తు చేసుకున్నాను.. అయినా జీరో బిల్లు రావడం లేదు? – అర్జున్, కోటగిరి మండలం హెగ్డోలి

జవాబు: ప్రజా పాలన ఫారంలో గృహజ్యోతి వద్ద టిక్ చేసుకోవడంతో పాటు రేషన్‌కార్డు ఉండాలి. రేషన్‌కార్డు ఉన్నా జీరో బిల్లు రాకపోతే సంబంధిత ఎంపీడీవో కార్యాలయంలో సంప్రదిస్తే సమస్య పరిష్కారం అవుతుంది. ఇప్పటి వరకు ఉన్న విద్యుత్ బిల్లును చెల్లించాల్సిందే.

■ వర్షాకాలంలో కూడా లో ఓల్టేజీ సమస్య వేధిస్తోంది. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయండి..? – పాలెం రాజారెడ్డి, మోర్తాడ్ మండలం దొన్కల్

✣ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ పెరిగితే సంబంధిత ఏఈ వచ్చి పర్యవేక్షణ చేసి మీ సమస్యకు పరిష్కారం చూపిస్తారు. అవసరమైతే కొత్తది ఏర్పాటు చేయిస్తాం.

■ నగరంలోని కంఠేశ్వర్, న్యూ బ్యాంక్‌కాలనీలో ఓల్టేజ్ సమస్యతో టీవీలు, ఫ్రిజ్‌లు కాలిపోతున్నాయి. రెండేళ్లుగా సమస్య తీవ్రంగా ఉంది? –శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, బ్యాంక్ కాలనీ

✣ మీ ప్రాంతానికి విద్యుత్ సిబ్బంది వచ్చి పరిశీలిస్తారు. వారికి మీ ఫోన్ నంబర్ ఇస్తాను. అవసరమైన చర్యలు చేపట్టి సమస్య పునరావృతం కాకుండా చూస్తాం.

■ నవీపేట్ మండలం నాగేపూర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం అధికారులు డబ్బులు అడుగుతున్నారు ? – రాజరత్నం, నాగేపూర్, నవీపేట్ మండలం

✣ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కోసం విద్యుత్ అధికారులకు డబ్బులు ఇవ్వకూడదు. అధికారి ఎందుకు డబ్బులు అడిగారనే విషయమై రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

సాక్షి ఫోన్ ఇన్

■ వర్షాకాలం ఇనుప స్తంభాలకు కరెంట్ షాక్ వచ్చే అవకాశం ఉంటుంది. మా ప్రాంతంలోని పోల్స్‌ను మార్చండి ? – నాగరాజు, గాజుల్‌పేట్/సురేష్, వినాయక్‌నగర్

✣ ఇనుప స్తంభాలు అన్నింటిని మార్చడం కుదరదు. ఇన్సులేటర్ ఉంటుందే తప్పా స్తంభాలకు కరెంట్‌షాక్ తగలదు. ముందు జాగ్రత్తగా దూరంగా ఉండాలని చెబుతున్నాం. మీ ప్రాంతంలో అధ్వాన్నంగా ఉన్న ఇనుప స్తంభాలనుమాత్రమే మార్చడానికి అవకాశం ఉంటుంది.

■ విద్యుత్ అధికారులు ప్రజాప్రతినిధుల ఫోన్లు ఎత్తడంలేదు. మీటర్ల జారీ విషయంలో సిబ్బంది అక్రమాలకు పాల్పడుతున్నారు ? –సాయివర్ధన్, 9వ డివిజన్ కార్పొరేటర్

✣ ప్రజాప్రతినిధులు ఫోన్ చేస్తే ఏ అధికారైనా స్పందించకపోతే నేరుగా నాకు ఫోన్ చేయండి. సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటాం. మీటర్ల విషయంలో అక్రమాలకు పాల్పడుతుండడంపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాను.

■ డొంకేశ్వర్ మండల కేంద్రంలో ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్‌లు అధ్వానంగా ఉండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది ? –రమేశ్, డొంకేశ్వర్

✣ సెక్షన్ ఏఈని డొంకేశ్వర్ మండల కేంద్రానికి పంపిస్తాను. ఎక్కడెక్కడ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్‌లు వదులుగా ఉన్నాయో పరిశీలన చేయిస్తాను. విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చర్యలు చేపడతాం.

■ నగరంలోని వినాయక్‌నగర్‌లోని పంచముఖి హనుమాన్ ఆలయ ప్రాంతంలో ఓవర్ లోడ్ సమస్య తీవ్రంగా ఉంది – తిరుపతి/గంగాధర్/రమేశ్, వినాయక్‌నగర్.

✣ వినాయక్‌నగర్‌లోని పంచముఖి హనుమాన్ ప్రాంతంలో ఓవర్‌లోడ్ సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటాం. డీ–4 సెక్షన్ ఏఈ వచ్చి పరిశీలించి అవసరమైతే మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తారు.

■ సీహెచ్ కొండూర్‌లో ఓ ఉద్యోగి బిల్లు కడతానని నా వద్ద రూ. 1600 తీసుకొని ఇప్పటి వరకు వెనక్కి ఇవ్వలేదు ? – నీరడి దేవిదాస్, మాజీ సర్పంచ్, సీహెచ్ కొండూర్

✣ విద్యుత్ సిబ్బంది ఎవరైనా డబ్బులు తీసుకోవడం నేరం. సదరు వ్యక్తి ఎవరో తెలుసుకోమని నేను నందిపేట్ ఏఈని చెబుతాను. విద్యుత్ సిబ్బంది డబ్బులు తీసుకున్నట్లు తెలిస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటా. మీ డబ్బు వెనక్కి ఇప్పిస్తాను.

■ సీహెచ్ కొండూర్‌కు లైన్‌మన్‌ను నియమించాలి. కరెంట్‌పోతే పట్టించుకునే వారు లేరు? –సంజీవ్, సీహెచ్‌కొండూర్, నందిపేట్

✣ విద్యుత్ సిబ్బంది కొరత ఉండడంతో రెండు, మూడు గ్రామాలకు ఒక్క లైన్‌మన్లను కేటాయించడం జరిగింది. ఏ సమస్య వచ్చినా ఇన్‌చార్జి లైన్‌మన్ పరిష్కరిస్తారు. వారు స్పందించకపోతే ఏఈ, ఏడీఈలకు ఫిర్యాదు చేయండి. బదిలీల సమయంలో లైన్‌మన్‌ను కేటాయిస్తాం.


■ దరఖాస్తు చేసుకున్నా జీరో బిల్లు రావడం లేదు ? – సాయిలు, దశరథ్, అంబం, రుద్రూర్ మండలం/ గాంధారి సురేష్‌రెడ్డి, అనంతగిరి, నవీపేట్‌మండలం

✣ ప్రజాపాలన దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు అందించి గృహజ్యోతికి దరఖాస్తు చేసుకుంటే కచ్చితంగా జీరో బిల్లు వస్తుంది. గృహజ్యోతికి సంబంధించి సమస్య వస్తే ఎంపీడీవో, ఆర్డీవో కార్యాలయంలో సంప్రదించండి.

■ మారుతి నగర్‌లో విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు అలాగే ఉన్నాయి. దీంతో తరచూ సరఫరా లో అంతరాయం ఏర్పడుతుంది ? –మురళీధర్‌రెడ్డి, మారుతి నగర్, రమేశ్, వినాయక్‌నగర్

✣ విద్యుత్‌వైర్లపై చెట్ల కొమ్మలను తొలగించడానికి తక్షణమే చర్యలు తీసుకుంటాం. కరెంటు సరఫరాలో ఇబ్బందులు రాకుండా సిబ్బంది పర్యవేక్షణ చేసి సమస్య పరిష్కరిస్తారు. ఏడీఈ కూడా ఫోన్ చేస్తారు.

అంచనాకు మించినా..!



నిండుకుండలా మారిన మంచిప్ప పెద్ద చెరువు

- వర్షపాతం గతేడాది కంటే తక్కువే..
- 375.7 మిల్లీమీటర్లకు గాను 494.8 మి.మీ. కురిసిన వాన
- మూడు రోజులుగా ముసురు
- మరో రెండు రోజులు జిల్లాకు వర్షసూచన

సుభాష్‌నగర్: వానాకాలం సీజన్ ప్రారంభం నుంచి జిల్లాలో అంచనాకు మించి వర్షం కురిసింది. కానీ గతేడాది కంటే తక్కువ మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వారం రోజులుగా పలు మండలాల్లో భారీ వర్షం కురవగా, మూడు రోజులుగా ఇందూరుకు ముసురు పట్టింది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని వందకుపైగా చెరువులు అలుగులు పారుతున్నాయి. మిగతా చెరువుల్లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిసి 84 శాతానికిపైగా సాగు పూర్తయ్యింది. కాగా జిల్లాకు మరో రెండు రోజులు వర్షసూచన ఉన్నట్లు వాతావరణ కేంద్రం ప్రకటించింది.

జిల్లాలో జూన్ 1 నుంచి ఇప్పటివరకు 494.8 మిల్లీమీటర్ల సగటు వర్షం కురిసింది. వాతావరణ శాఖ అధికారులు 375.7 మిల్లీమీటర్లు కురుస్తుందని అంచనా వేశారు. కానీ అంచనా కంటే 119.1 మిల్లీమీటర్ల వర్షం అధికంగా కురిసింది. గతేడాది జూలై 25 వరకు నాటికి 535.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గతేడాదితో పోల్చితే 41 మిల్లీమీటర్ల వాన తక్కువగా పడింది.

వరి సాగుకు అనుకూలంగా వర్షాలు

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు వరి సాగుకు చాలా అనుకూలంగా ఉన్నాయి. జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి 84 శాతానికిపైగా సాగు పూర్తయ్యింది. వరి సాగు 4,30,550 ఎకరాలను ప్రతిపాదించగా, ఇప్పటివరకు 3 లక్షల వరకు నాట్లు పూర్తిచేశారు. మరో 20 రోజుల వరకు నాట్లు వేసుకోవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. మొత్తం 5,52,128 ఎకరాల్లో అంచనా వేయగా, ఇప్పటికే 4,47,555 ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటల సాగు పూర్తిచేశారు.

అలుగు పారుతున్న చెరువులు

జిల్లాలో 996 చెరువులు ఉండగా.. వారం రోజులుగా కురుస్తున్న వానలకు 103 చెరువులు అలుగులు పారుతున్నాయి. 25శాతం వరకు 203 చెరువులు, 50శాతం వరకు 188, 75శాతం వరకు 316 చెరువులు నిండాయి. మరో 186 చెరువులు నిండుకుండల్లా (75 శాతం నుంచి వందశాతం వరకు) మారాయి.

వర్షపాతం వివరాలు

మండలం	గతేడాది (జూలై 25)	ఈ ఏడాది (ఇప్పటివరకు)	మండలం	గతేడాది (జూలై 25)	ఈ ఏడాది (ఇప్పటివరకు)	మండలం	గతేడాది (జూలై 25)	ఈ ఏడాది (ఇప్పటివరకు)
						డిచ్‌పల్లి	586.3	355.0
						ఇందల్వాయి	525.9	392.4
నవీపేట్	705.0	956.7	మాక్లూర్	556.0	465.8	ధర్పల్లి	498.3	377.0
నందిపేట్	515.4	549.2	ని. నార్త్	512.8	378.5	భీమ్‌గల్	633.1	475.6
ఆర్మూర్	516.7	370.8	ఎడపల్లి	501.4	567.8	సిరికొండ	522.4	348.8
బాల్కొండ	527.6	569.7	రెంజల్	592.3	636.0	మోస్రా	462.0	421.3
ముప్కాల్	413.2	593.3	బోధన్	542.7	522.1	చందూరు	511.4	484.2
మెండోరా	453.0	613.7	కోటగిరి	627.4	549.3	ఆలూరు	554.3	467.8
ఏర్గట్ల	468.4	613.2	రుద్రూరు	479.1	424.3	డొంకేశ్వర్	516.7	444.0
కమ్మర్‌పల్లి	487.5	516.2	వర్ని	625.8	518.4	సాలూరా	478.9	539.7
మోర్తాడ్	556.1	566.1	ని. రూరల్	500.2	402.8	పోతంగల్	578.1	567.1
వేల్పూర్	856.7	457.9	ని. సౌత్	361.5	444.4	మొత్తం	17680.3	16326.9
జక్రాన్‌పల్లి	566.7	375.9	మోపాల్	447.4	593.0	జిల్లా సగటు	535.8	494.8

క్లుప్తంగా

నగరాభివృద్ధికి నిధులు హర్షణీయం



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ నగరాభివృద్ధికి స్పెషల్‌ డెవలప్‌మెంట్‌ ఫండ్‌ (ఎస్‌డీఎఫ్‌) కింద సీఎం రేవంత్‌రెడ్డి రూ.10 కోట్లు ప్రకటించడం హర్షణీయ మని నగర కాంగ్రెస్‌ అధ్యక్షుడు కేశవేణు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, కొత్తగా డ్రెయినేజీలు, కల్వర్టుల నిర్మాణానికి రూ.6.25 కోట్లు, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.1.30 కోట్లు కేటాయించగా, మిగతా రూ.2.45 కోట్లు నగరంలో మంచినీటి వ్యవస్థ కోసం కేటాయించినట్లు వివరించారు. నగరాభివృద్ధికి రూ. 10 కోట్లు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డితోపాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ సలహాదారు, నిజామాబాద్‌ నగర ఇన్‌చార్జి మహ్మద్‌ అలీ షబ్బీర్‌, ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నామని పేర్కొన్నారు.

తగ్గుతూ.. పెరుగుతున్న ఇన్‌ఫ్లో

బాల్కొండ: శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతాల నుంచి వరద తగ్గుతూ పెరుగుతోంది. బుధవారం 20వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా, గురువారం ఉదయం 19వేలకు, మధ్యాహ్నం తరువాత 17,200కు పడిపోయింది. సాయంత్రానికి మళ్లీ 22వేల క్యూసెక్కులకు పెరిగింది. ఇలా రోజంతా ఇన్‌ఫ్లో తగ్గుతూ పెరుగుతూ కొనసాగింది. అయితే, ప్రాజెక్ట్‌ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. సరస్వతి కాలువకు 10 క్యూసెక్కులు, మిషన్‌ భగీరథ అవసరాలకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 323 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా, గురువారం సాయంత్రానికి 1072.20 (27టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్‌ అధికారులు తెలిపారు.

నిలిచిన రాకపోకలు



డొంకేశ్వర్‌(ఆర్మూర్‌): ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో మండలంలోని కోమట్‌పల్లి శివారులోని చెరువు అలుగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కోమట్‌పల్లి, నికాల్‌పూర్‌ తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. డొంకేశ్వర్‌, నందిపేట్‌ మండలాలకు వెళ్లాల్సి ఉంటే ఆయా గ్రామాల ప్రజలు వేరే రూట్లో వెళ్తున్నారు. అలుగు ప్రవహిస్తున్న రోడ్డు మీదుగా రాకపోకలు సాగకుండా తహసీల్దార్‌ వెంకటరమణ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి నరేందర్‌ చర్యలు చేపట్టారు. రోడ్డుకు అడ్డంగా జీపీ ట్రాక్టర్‌ను నిలిపి ఉంచడంతోపాటు ప్రత్యేకంగా ఓ వ్యక్తిని అక్కడ కాపలా ఉంచారు. వరద ఉధృతి తగ్గే వరకు రాకపోకలు సాగించొద్దని ఆయా గ్రామాల ప్రజలకు తహసీల్దార్‌ సూచించారు.

అధికారుల సంరక్షణలో బాలుడు



కామారెడ్డి క్రైం: తప్పిపోయిన దివ్యాంగ బాలుడిని కామారెడ్డి ఐసీడీఎస్‌ అధికారులు చేరదీసి బాలల పరిరక్షణ విభాగంలో ఉంచారు. ఈ మేరకు ఐసీడీఎస్‌ పీడీ బావయ్య గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న కామారెడ్డి కొత్త బస్టాండ్‌ ఆవరణలో బాలుడు ఒంటరిగా ఉండగా, స్థానికులు గమనించి 1098 చైల్డ్‌ హెల్ప్‌లైన్‌కు సమాచారం ఇచ్చారని, అధికారులు అక్కడికి చేరుకుని విచారించగా బాలుడికి మూగ, చెవుడు ఉన్నట్లు గుర్తించారని పేర్కొన్నారు. అతడు మాట్లాడలేకపోవడంతో వివేకానంద కాలనీలోని బాలల పరిరక్షణ విభాగానికి తరలించారని, బాలుడి కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే పూర్తి ఆధారాలతో వచ్చి సంప్రదించాలని సూచించారు.

బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు

రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
– ఖలీల్‌వాడి/సుభాష్‌నగర్‌/నిజామాబాద్‌ నాగారం/తెయూ(డిచ్‌పల్లి)

హామీల అమలుకు నిధులేవి..



ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదు. పింఛన్లకు కేటాయింపులు లేవు. కాంట్రాక్ట్‌, అవుట్‌సోర్సింగ్‌ ఉద్యోగుల, ఉపాధి అవకాశాలు, హామీల అమలు విషయం మరిచారు. నిజాంషుగర్స్‌ను తెరిపిస్తామని చెప్పడం హర్షణీయ. సారంగాపూర్‌ ఫ్యాక్టరీని తెరిపించడంతోపాటు పసుపు శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు నిధులు కేటాయించాలి. – రమేశ్‌బాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి

పరిశ్రమలను ప్రోత్సహిస్తే బాగుండేది



కుటీర, చిన్న పరిశ్రమలకు నిధులు కేటాయించి ప్రోత్సహిస్తే యువతకు ఉపాధి అవకాశాలు లభించేవి. విద్య, వైద్యం, వ్యవసారంగానికి పూర్తిస్థాయి నిధులు కేటాయించలేదు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య, ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాల మెరుగుపై స్పష్టత ఇవ్వలేదు. వ్యవసాయ పనిముట్లపై సబ్సిడీలు ప్రకటించాల్సింది.
– సుధాకర్‌, సీపీఐ, జిల్లా కార్యదర్శి

ఆరు గ్యారెంటీలపై స్పష్టత కరువు



వ్యవసాయ రంగానికి ఇంకా నిధులు కేటాయించాలి. ఆరోగ్యశ్రీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా చికిత్స అందించే వ్యాధుల సంఖ్యను పెంచాలి. విద్యారంగానికి నిధులు నామమాత్రంగా కేటాయించారు. 10 ఎకరాలు ఉన్న రైతులకు రైతు భరోసా ఇవ్వాలి. ఆరు గ్యారంటీల అమలుకు నిధులు కేటాయించలేదు.
– వి ప్రభాకర్‌, సీపీఐఎంఎల్‌ న్యూడెమోక్రసీ, నిజామాబాద్‌

అవమానకరం



బడ్జెట్‌లో బీసీలకు కేవలం రూ.9,200 కోట్లు కేటాయించడం, కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌పై సభలో మాట్లాడకపోవడం బాధాకరం. కనీసం రూ.20 వేల కోట్లకుపైగా కేటాయించాల్సి ఉండగా, కేవలం రూ.9200 కోట్లు కేటాయించడం బీసీలకు అవమానకరం. విద్య, వైద్యారోగ్యం, స్త్రీ సంక్షేమానికి కేటాయింపులు తగ్గించారు. – డాక్టర్‌ కేశవులు, చైర్మన్‌, తెలంగాణ మేధావుల సంఘం

నిరాశను మిగిల్చింది



విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తామని హామీ ఇచ్చి బడ్జెట్‌లో కేవలం 7.31శాతం నిధులు కేటాయించడం తీవ్ర నిరాశను మిగిల్చింది. ఉన్నత విద్యారంగానికి కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవు. బడ్జెట్‌ లో విద్యారంగానికి 20 శాతానికి తగ్గకుండా నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కొంతకాలంగా మేధావులు, విద్యావేత్తలు కోరినప్పటికీ పట్టించుకోలేదు.
– ఏ పున్నయ్య, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, తెయూ

రైతు సంక్షేమ బడ్జెట్‌



వ్యవసాయ రంగానికి రూ.72,659 కోట్లు కేటాయించడం అభినందనీయం. భూమిలేని రైతు కూలీల ఆర్థిక, జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు ఏడాదికి రూ.12వేల ఆర్థిక సహాయం అందిస్తామనడం, రైతులకు పంట బీమాతోపాటు వరికి బోనస్‌, రైతులకు ఏటా ఎకరానికి రూ.15 వేలు రైతుభరోసా కింద కేటాయించారు. హార్టికల్చర్‌, ఆయిల్‌పామ్‌ సాగుకు, పశుసంవర్ధక రంగానికి నిధులు కేటాయించారు.
– తోకల సంపత్‌, అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌, తెయూ

సంక్షేమ పథకాల అమలుకు ప్రాధాన్యం



సంక్షేమ పథకాలు అమలుచేయడానికి బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇచ్చారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధికి కేటాయింపులు దీనిని సూచిస్తున్నాయి. ఆరు గ్యారెంటీల అమలుకు రూ.53,196 కోట్లు కేటాయించినప్పటికీ వాస్తవంగా నిధులు సరిపోవు. ముఖ్యంగా గత బడ్జెట్‌లో రూ.9,031 కోట్లుగా ఉన్న రెవెన్యూ మిగులు రూ.297 కోట్లకు తగ్గడం ఆందోళనకరం. విద్యారంగానికి నిధుల కేటాయింపు పెరిగినప్పటికీ మొత్తం బడ్జెట్‌లో వాటా కేవలం 7.31 శాతంగా ఉంది.
– కె రవీందర్‌రెడ్డి, ప్రొఫెసర్‌, తెయూ

విద్యారంగానికి ప్రాధాన్యం



విద్యారంగాన్ని మరింత పటిష్టపరిచి బలోపేతం చేసే దిశగా బడ్జెట్లో రూ.21,292 కోట్లు ప్రతిపాదించారు. అలాగే విశ్వవిద్యాలయాల అభివృద్ధికి మౌలిక సదుపాయాలకు రూ.500 కోట్ల నిధులు ప్రతిపాదించారు. ప్రభుత్వ ఐటీఐలను ప్రైవేట్‌ సంస్థల సహకారంతో నైపుణ్య కేంద్రాలుగా మార్చే ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం టాటా టెక్నాలజీస్‌ లిమిటెడ్‌ వారితో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. వీటిలో నేటి పరిశ్రమల అవసరాలకి తగ్గట్టుగా 6 కొత్త దీర్ఘకాల కోర్సులను ప్రవేశపెడుతున్నారు. – పాత నాగరాజు, అసోసియేట్‌ ప్రొఫెసర్‌, తెయూ

61 ఏళ్ల ఎస్సారెస్పీ

- 18 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా రూపకల్పన
- 1963 జూలై 26న శంకుస్థాపన చేసిన నాటి ప్రధాని నెహ్రూ



ప్రాజెక్ట్‌ మ్యాప్‌ను పరిశీలిస్తున్న నాటి ప్రధాని నెహ్రూ(ఫైల్‌)

బాల్కొండ: ఉత్తర తెలంగాణ వరప్రదాయిని శ్రీరాంసాగర్‌ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి నేటితో 61 ఏళ్లు నిండనున్నాయి. ఎంతోమంది రైతుల కడుపు నింపుతున్న ఈ జలాశయానికి 1963 జూలై 26న నాటి ప్రధాని పండిట్‌ జవహర్‌ లాల్‌ నెహ్రూ శంకుస్థాపన చేశారు. లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేస్తున్న శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ రూపుదిద్దుకోవడానికి 19 ఏళ్ల సుదీర్ఘ కసరత్తు దాగి ఉందని చెప్పవచ్చు. ఎస్సారెస్పీని మూడు ప్రయోజనా లు ఆశించి నిర్మించారు. 18 లక్షల ఎకరాలకు సాగునీరు, 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి, చేపల పెంప కం అనే ఆశయాలతో ఈ ప్రాజెక్ట్‌ నిర్మించారు. 112 టీఎంసీల సామర్థ్యంతో 175చదరపు మైళ్ల విస్తీర్ణంతో గోదావరి జన్మ స్థానానికి 326 మైళ్ల దూరంలో ఆదిలాబాద్‌, నిజామాబాద్‌ సరిహద్దు ప్రాంతంలో నిర్మించగా, మూడు ప్రధాన కాలువలు హైలెవల్‌(లక్ష్మి), సౌత్‌కాలువ (కాకతీయ),నార్త్‌ కాలువ (సరస్వతి) ఉన్నాయి.

1983లో వరదలు

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌ పనులు 1963లో ప్రారంభమైన 1970లో కాకతీయ కాలువ పనులు 30 కిలో మీటర్ల వరకు పూర్తి అయ్యాయి. దీంతో నిజామాబాద్‌, కరీంనగర్‌ జిల్లాల్లోని 40 వేల ఎకరాలకు మొదటిసారి నీరందించారు. ప్రాజెక్ట్‌ నుంచి అప్పటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి నీటి విడుదల చేపట్టారు. 1983లో ప్రాజెక్ట్‌ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాగా, అదే సంవత్సరం భారీ వరదలు వచ్చాయి.

ప్రభుత్వాల నిర్లక్ష్యం

శ్రీరాంసాగర్‌ ప్రాజెక్ట్‌పై ఆది నుంచి ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. 2017లో ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పేరిట కొన్ని నిధులు మంజూరు చేశారు. ఆ తర్వాత ప్రాజెక్ట్‌ అభివృద్ధిని మరిచిపోయారు. ప్రాజెక్ట్‌లో పూడిక పేరుకుపోవడంతో నీటి సామర్థ్యం 80 టీఎంసీలకు పడిపోయింది. ప్రాజెక్ట్‌ ప్రధాన సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కావడం లేదు. ప్రాజెక్ట్‌ భద్రత కోసం ఏళ్ల తరబడి ప్రతిపాదనలు పంపుతున్నా పట్టించుకోవడం లేదు. అంతేగాకుండా ప్రాజెక్ట్‌లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. నూతన నియామకాలు చేపట్టడం లేదు. ఎస్సారెస్పీని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి పర్యా టక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

కల్లు శాంపిళ్ల సేకరణ?

- మూడో డిపోతోపాటు రెండు దుకాణాల్లో..
- వీడియో చిత్రీకరణను మరిచిన అధికారులు

ఖలీల్‌వాడి: నగరంలోని న్యాల్‌కల్‌ రోడ్డులో ఉన్న మూడో కల్లు డిపోతోపాటు రెండు దుకాణాల్లో నుంచి ఎక్సైజ్‌ ఎస్‌హెచ్‌వో దిలీప్‌, ఎస్సై సుష్మ గురువారం కల్లు శాంపిళ్లు సేకరించినట్లు తెలిసింది. అయితే, శాంపిళ్లు సేకరిస్తున్న సమయంలో అధికారులు వీడియో తీయకపోవడం గమనార్హం. డిపోతోపాటు కల్లుదుకాణాల నుంచి అధికారులు కల్లుప్యాకెట్లు తీసుకెళ్లినట్లు తెలిసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కల్లుప్యాకెట్లను తీసుకెళ్లిన అధికారులు.. వాటిని ల్యాబ్‌కు పంపిస్తారా? లేదా? అనేదానిపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శాంపిళ్లను మార్చి పంపితే చేసేదేమీ ఉండదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వీడియో చిత్రీకరించకుండా కల్లు శాంపిళ్లు ఎలా తీసుకెళ్తారని ప్రశ్నిస్తున్నారు. రెగ్యులర్‌గా కల్లు దుకాణాలతోపాటు డిపోల నుంచి శాంపిళ్లను సేకరిస్తామని, అందులో భాగంగా ఎస్‌హెచ్‌వో దిలీప్‌, ఎస్సై సుష్మ తనిఖీలు చేసి ఉండొచ్చని ఎక్సైజ్‌ సూపరింటెండెంట్‌ మల్లారెడ్డి అన్నారు. అయితే డిపో నుంచి శాంపిల్‌ సేకరించిన సమాచారం తనకు లేదని స్పష్టం చేశారు.

బడ్జెట్‌లో హామీల అమలు ఊసేది?

- నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ



అసెంబ్లీ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతున్న అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ

సుభాష్‌నగర్‌: రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆరు గ్యారెంటీలు, ఐదు డిక్లరేషన్లు, 420 హామీల అమలు ఊసెత్తలేదని, భట్టివిక్రమార్క మాటలన్నీ ఉత్త మాటలేనని నిజామాబాద్‌ అర్బన్‌ ఎమ్మెల్యే ధన్‌పాల్‌ సూర్యనారాయణ విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌ వద్ద గురువారం ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తూ అసెంబ్లీలో పెట్టిన తీర్మానం వెనుక మతలబు ఏమిటో రాష్ట్ర ప్రజలకు ఈ బడ్జెట్‌తో తేటతెల్లమైందన్నారు. తెలంగాణకు కేంద్రం ఏమిచ్చిందని కాంగ్రెస్‌ నాయకులు ప్రశ్నించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా అప్పులపైనే ఆధారపడాల్సి వస్తోందని, ఒక్క ఏడాదికే దాదాపు రూ.70వేల కోట్ల అప్పులకు ప్రతిపాదనలు చేశారని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంతిళ్లు, నిరుద్యోగులకు భృతి, అమరుల ఇంటికో ఉద్యోగం, పెన్షన్‌ రూ.4వేలకు పెంచడం, ఇతర హామీలకు నిధులు కేటాయించలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం బడ్జెట్‌ ద్వారా మరోసారి మోసం చేసిందన్నారు. 52శాతం ఉన్న బీసీల సంక్షేమానికి కేవలం రూ.9వేల కోట్లు మాత్రమే కేటాయించి అన్యాయం చేసిందని, నిజాంషుగర్స్‌ ఫ్యాక్టరీని తెరిపిస్తామని, ఎలాంటి నిధులు కేటాయించలేదని ఆరోపించారు.

బర్త్‌డే పార్టీకి వెళ్లొచ్చే సరికి చోరీ



ఇంటిని పరిశీలిస్తున్న సీఐ నరహరి, ఎస్సై ప్రవీణ్‌

ఖలీల్‌వాడి: బర్త్‌ డే పార్టీ కోసం హైదరాబాద్‌ వెళ్లొచ్చే సరికి దుండగులు ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన నగరంలోని మూడో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని హమాల్‌వాడీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. తన సోదరుడి కుమారుడి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందుకు వారణాసి వేణుకుమార్‌ కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 23న ఉదయం 11:30 గంటలకు హైదరాబాద్‌కు వెళ్లాడు. వేడుకల అనంతరం గురువారం తెల్లవారుజామున హైదరాబాద్‌ నుంచి వస్తుండగానే పక్కింటికి చెందిన గణేశ్‌ అనే వ్యక్తి ఫోన్‌ చేసి మీ ఇంటి తాళం పగులగొట్టి ఉందని వేణుకుమార్‌కు ఫోన్‌ చేశాడు. ఇంటికి వచ్చి చూసేసరికి రెండు బెడ్‌ రూములలోని బీరువాలు ధ్వంసమై ఉన్నాయి. దుండగులు సుమారు 80 గ్రాముల బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చోరీ జరిగిన ఇంటిని సీఐ నరహరి, ఎస్సై ప్రవీణ్‌ పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సెల్‌ఫోన్‌ల రికవరీలో ఒకటో ఠాణా 'ఫస్ట్‌'



సెల్‌ఫోన్‌లను అందజేస్తున్న ఒకటో టౌన్‌ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు(ఫైల్‌)

ఖలీల్‌వాడి: స్మార్ట్‌ ఫోన్‌ వాడకం మామూలు విషయమై ఈ రోజుల్లో వినియోగదారులు ఫోన్‌లను పోగొట్టుకోవడంతోపాటు చోరీలూ ఎక్కువయ్యాయి. వెంటనే బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఆయా పోలీస్‌ స్టేషన్‌ల పరిధిలో సెల్‌ఫోన్‌లకు సంబంధించి కేసులు ఎక్కువ సంఖ్యలో ఉండగా, సీడీఆర్‌ పెట్టినా దొరకని పరిస్థితులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పోలీసులు నూతన సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సీఈఐఆర్‌ (సెంట్రల్‌ ఎక్విప్‌మెంట్‌ ఐడెంటిటీ రిజిస్టర్‌) విధానంతో సెల్‌ఫోన్‌లను రికవరీ చేసి వినియోగదారులకు తిరిగి అందించడంలో రాష్ట్రంలోనే జిల్లాలోని ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ మొదటి స్థానంలో నిలిచింది. ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సీఈఐఆర్‌ ద్వారా 1432 దరఖాస్తులు రాగా ఇందులో 904 సెల్‌ఫోన్లను గుర్తించి అందించగా, మిగతా 499 ఫోన్‌లను బ్లాక్‌ చేశారు. మరో 29 ఫోన్‌లను బాధితులకు అందించాల్సి ఉంది. రాష్ట్రంలో 30 పోలీస్‌స్టేషన్‌లకు సంబంధించిన జాబితాను సీఈఐఆర్‌ పోర్టల్‌లో పొందుపర్చగా, ఇందులో ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ రాష్ట్రంలోనే ప్రథమస్థానం సాధించింది. హెడ్‌కానిస్టేబుల్‌ యాకుబ్‌, కానిస్టేబుల్‌ అనూషను సీపీ కల్మేశ్వర్‌ అభినందించారు.

బాధితులతో దరఖాస్తు చేయిస్తున్నాం

ఏ కంపెనీ సెల్‌ఫోన్‌ అయినా బాధితులతో సీఈఐఆర్‌ పోర్టల్‌లో నమోదు చేయిస్తున్నాం. హెడ్‌కానిస్టేబుల్‌ యాకూబ్‌, మహిళా కానిస్టేబుల్‌ అనూష సీఈఐఆర్‌ ద్వారా పర్యవేక్షిస్తున్నారు. సెల్‌ఫోన్‌ పని చేయకుండా చేయడంతోపాటు ఫోన్‌ ఎక్కడ ఉన్నది తెలుసుకొని రికవరీ చేసి బాధితులకు అప్పగిస్తున్నాం. రాష్ట్రంలో ఒకటో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ ప్రథమ స్థానంలో నిలవడం సంతోషకరం. దీంతో సిబ్బంది పాత్రం కీలకంగా ఉంది.
– విజయ్‌బాబు, ఎస్‌హెచ్‌వో, ఒకటో టౌన్‌, నిజామాబాద్‌

స్పీకర్‌ విచక్షణాధికారాలపై అవగాహన



తెయూ(డిచ్‌పల్లి): అసెంబ్లీ, పార్లమెంట్‌ స్పీకర్‌లకు రాజ్యాంగం విచక్షణాధికారాలను కల్పించిందని నిజామాబాద్‌ సీనియర్‌ న్యాయవాది జె. వెంకటేశ్వర్లు తెలిపారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో ఎల్‌ఎల్‌బీ చివరి సంవత్సరం విద్యార్థులకు మూట్‌(నమూనా)కోర్టు నిర్వహించారు. మూట్‌ కోర్టుకు ఎక్స్‌టర్నల్‌ ఎగ్జామినర్‌గా సీనియర్‌ న్యాయవాది వెంకటేశ్వర్లు వ్యవహరించారు. మూట్‌ కోర్టులో భాగంగా ఎమ్మెల్యేల పార్టీల మార్పిడి వ్యవహారాలపై కేసును రూపొందించారు. ఈ కేసును భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్ట్‌లో వాజ్యం దాఖలైన సందర్భంలో స్పీకర్‌ గల హక్కులు, విచక్షణ అధికారాలపై న్యాయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌, హెచ్‌వోడీ కే.ప్రసన్నరాణి, బీవోఎస్‌ చైర్మన్‌ జెట్లింగ్‌ ఎల్లోసా, అధ్యాపకులు బి.స్రవంతి, ఎం.నాగజ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి..



వివరాలు తెలుసుకుంటున్న సీఐ మల్లేశ్‌

జక్రాన్‌పల్లి: మహిళను దుండగులు కత్తితో బెదిరించి బంగారం, నగదు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని నారాయణ్‌పేట్‌లో గురువారం రాత్రి జరిగింది. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన జానకంపేట్‌ లక్ష్మి అనే మహిళ భర్త దుబాయిలో ఉంటుండగా, కుమారుడు గ్రామంలో మరోచోట నివాసం ఉంటున్నాడు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న లక్ష్మి బుధవారం రాత్రి నిద్రిస్తుండగా, గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు వచ్చి 'మీ మరిది మరణించాడు.. తలుపులు తీయు' అంటూ పిలిచారు. లక్ష్మి తలుపులు తీసిన వెంటనే సదరు వ్యక్తుల్లు కత్తితో బెదిరించి బీరువాలోని రెండు తులాల పుస్తెలతాడు, కొంత నగదును ఎత్తుకెళ్లారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్‌ గ్రామానికి చేరుకొని విచారణ చేపట్టారు. బాధితురాలి కుమారుడు మహేశ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కరెంట్‌ షాక్‌తో మహిళ మృతి

- కిందికి వేలాడుతున్న విద్యుత్‌ వైర్లకు తగిలిన గొడుగు
- మఠంరాళ్ల తండాలో విషాదం



ప్రమీల మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

ప్రమీల (ఫైల్‌)

మాచారెడ్డి: వర్షం కారణంగా విద్యుత్‌స్తంభం వంగి కిందికి వేలాడుతున్న విద్యుత్‌ వైర్లకు గొడుగు తగిలిన ఘటనలో మహిళ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని అంకిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మఠంరాళ్ల తండాలో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తండాకు చెందిన రమావత్‌ ప్రమీల(28)కు అదే తండాకు చెందిన రవితో వివాహమై ఓ కుమారుడు పుట్టిన తర్వాత విడాకులయ్యాయి. అప్పటి నుంచి తల్లిదండ్రుల వద్ద ఉంటున్న ప్రమీల కొంత వ్యవసాయభూమిని కౌలుకు తీసుకొని జీవిస్తోంది. రోజులాగే గురువారం సద్ది గంప ఎత్తుకొని గొడుగు పట్టుకొని వెళ్తుండగా కిందికి వేలాడుతున్న 11కేవీ విద్యుత్‌వైర్లు గొడుగు తగిలి ప్రమీలకు షాక్‌ కొట్టింది. ఈ ఘటనలో ప్రమీల అక్కడికక్కడే మృతి చెందింది. అందరితో కలివిడిగా ఉండే ప్రమీల మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ..

నిజామాబాద్‌రూరల్‌: బైక్‌ అదుపుతప్పిన ఘటనలో రూరల్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని కాలూర్‌కు చెందిన కోర్వ గంగాధర్‌(44) మృతి చెందినట్లు రూరల్‌ ఎస్‌హెచ్‌వో మహేశ్‌ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం సాయంత్రం గంగాధర్‌ తన బైక్‌పై నిజామాబాద్‌కు వెళ్లి వర్షం కురుస్తున్న సమయంలో తిరిగి రాత్రి సమయంలో వస్తుండగా మార్గమధ్యంలో బైక్‌ అదుపుతప్పి గాయాలపాలయ్యాడు. బాధితుడిని వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. మృతుడి భార్య సవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని శివాజీనగర్‌కు చెందిన వృద్ధురాలు కోనేరు లక్ష్మి(85) అదృశ్యమైనట్లు ఎస్సై శ్రీకాంత్‌ తెలిపారు.
మే 30వ తేదీన మధ్యాహ్నం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి లక్ష్మి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికారని, ఆచూకీ లభించకపోవడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేశారన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్‌

తల్లీకూతుళ్ల ఆత్మహత్య

- ఒకే దూలానికి ఉరిసుకొని..
- డోంగ్లీ మండల కేంద్రంలో కలకలం
- భర్త హత్య కేసులో నెల రోజుల క్రితం జైలు నుంచి బయటికి వచ్చిన మృతురాలు



డోంగ్లీలో విచారిస్తున్న పోలీసులు

మద్నూర్‌(జుక్కల్‌): తల్లీకూతుళ్లు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన డోంగ్లీ మండల కేంద్రంలో కలకలంరేపింది. ఇన్‌చార్జి ఎస్సై సాయన్న, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. శీతపులే మాలన్‌బాయి(46)కి కూతురు మనీష(23), కొడుకు మంగేశ్‌దీప్‌ ఉన్నారు. గత కొంత కాలంగా మాలన్‌బాయి అనారోగ్యంతో బాధపడుతుండగా, మనీషకు మతిస్థిమితం లేదు. పదో తరగతి చదువుతున్న మంగేశ్‌దీప్‌ గురువారం ఉదయం గ్రామంలోని పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చేసరికి తన తల్లితోపాటు అక్క ఉరేసుకొని ఉండడాన్ని గమనించి స్థానికులకు తెలిపాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

మూడు నెలల క్రితం భర్తను హత్య చేసి..

తనతో నిత్యం గొడవ పడుతున్నాడని మాలన్‌బాయి తన భర్త మష్టాజీని మూడు నెలల క్రితం తన మేనల్లుళ్లతో కలిసి హత్య చేసింది. ఈ కేసులో నెల రోజుల క్రితమే జైలు నుంచి బయటికి వచ్చింది. ఇప్పుడు కూతురితో కలిసి ఆత్మహత్య చేసుకోవడంతో కొడుకు మంగేశ్‌దీప్‌ అనాథ అయ్యాడు.

కుక్కర్‌ విషయంలో గొడవ

- మహిళపై హత్యాయత్నం కేసు నమోదు

నవీపేట: కుక్కర్‌ విషయంలో ఇద్దరు మహిళల మధ్య ఘర్షణం జరిగింది. ఈ ఘటన నవీపేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని జలాల్‌పూర్‌లో చోటు చేసుకోగా, ఓ మహిళపై హత్యాయత్నం కేసు నమోదైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన ఈర్నాల సావిత్రి అదే గ్రామానికి చెందిన గైనిశెట్టి గంగవ్వ వద్ద నెల రోజుల క్రితం కుక్కర్‌ను కొనుగోలు చేసింది. అది తరచూ రిపేర్‌ అవుతుండడంతో ఇద్దరి మధ్య గొడవ జరుగుతోంది. ఇటీవల నిజామాబాద్‌లో రిపేర్‌ చేయించినప్పటికీ మళ్లీ పని చేయకపోవడంతో గురువారం మళ్లీ గొడవ జరిగింది. ఈ క్రమంలో ఆగ్రహానికి గురైన సావిత్రి కమ్మకత్తిని తీసుకెళ్లి గంగవ్వ తలపై కొట్టింది. తీవ్ర రక్తస్రావం కావడంతో సావిత్రి పారిపోయే ప్రయత్నంలో కిందపడిపోగా స్వల్ప గాయాలయ్యాయి. గంగవ్వ సోదరుడు రాజు ఫిర్యాదు మేరకు సావిత్రిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్‌ తెలిపారు.